

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 38.0 । కనిష్ఠం : 22.0


రంజాన్ వేళలు

ఇఫ్తార్:-6:32 (సోమవారం సాయంత్రం)

సహార్: 5:00 (మంగళవారం ఉదయం)

పంథా మార్చిన సైబర్ నేరగాళ్లు

- స్థానికుల సాయంతో ఆన్‌లైన్ మోసాలు
- నిరుద్యోగులను నియమించుకొని చేసుకుని జామ్‌తారా, పాట్నాలో శిక్షణ
- జాబితా ఇచ్చి.. వచ్చిన సొమ్ములో భాగాలు
- ఒక్క ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే 150 మంది నిందితుల గుర్తింపు
- నెల రోజుల వ్యవధిలో 32 మందిని అరెస్టు చేసిన వనపర్తి జిల్లా పోలీసులు
- స్థానిక లొకేషన్స్ నుంచి మోసాలు చేయడం ద్వారా గుర్తించిన సైబర్ క్రైం
- రూ. 4 కోట్లు కాజేసినట్లు అంచనా
- అన్ని జిల్లాల్లో స్లీపర్ సెల్స్





సైబర్ నేరగాళ్ల అరెస్టును చూపుతున్న వనపర్తి ఎస్పీ గిరిధర్ (ఫైల్)

మహబూబ్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సైబర్ నేరగాళ్లు తమ పంథా మార్చారు. హిందీలో లాటరీ తగిలిందని, లోన్ మంజూరైందని చెప్పి గతంలో కాల్ చేసే ముఠాలు అలాంటి కాల్ మోసాలపై అవగాహన పెరగడంతో మోసాలకు పాల్పడటం కష్టంగా మారింది. దీంతో స్థానికంగా నిరుద్యోగులుగా ఉండి ఎక్కువగా చదువుకోని యువకులను టార్గెట్ చేసుకొని లోకల్ రిక్రూట్‌మెంట్ చేసుకుంటున్నారు. బిహార్‌లోని పాట్నా, జామ్‌తారా, కోల్‌కత్తలోని పలు కేంద్రాల్లో శిక్షణ ఇచ్చి తర్వాత వారిని మోసాల్లో భాగస్వాములుగా చేస్తున్నారు. వచ్చిన సొమ్మును మూడు భాగాలుగా విభజించి ఇస్తుండటంతో రాష్ట్రంలోని యువత కూడా సులభంగా జల్సాలకు అలవాటుపడుతోంది. దాదాపు నాలుగేళ్లుగా ఈ రిక్రూట్‌మెంట్, మోసాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలోని నక్కలబండ తండా, వాల్యతండా, గత సంవత్సరం పూజారి తండాలో ఇలా ఆ గోదాలోకి దిగి తప్పించుకునే ప్రయత్నంలో ముగ్గురు యువకులు కూడా చనిపోయారు. నాలుగేళ్ల నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా తండాలు, చిన్న గ్రామాలు, నిరుపేద యువకుల కేంద్రంగా ఈ తరహా నియామకాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా పరిధిలో బీహార్ ముఠాలు చేస్తున్న సైబర్ నేరాల్లో భాగస్వాములుగా

(మిగతా 6లో..)

ఫేస్‌బుక్‌లో చూసి..



వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన తోగుట రాజు గత డిసెంబరు 17న ఫేస్‌బుక్ చూస్తుండగా ధని ఫైనాన్స్ లోన్ యాప్ ప్రకటన పేజీని టచ్ చేశారు. తర్వాత తెలియని వ్యక్తి ఫోన్ చేసి లోన్ కావాలా అని అడగ్గా రూ. 3 లక్షలు కావాలని చెప్పాడు. ప్రతీనెల రూ. 8860 చొప్పున చెల్లించాలని చెప్పి ఇన్సూరెన్స్ కోసం డబ్బులు అడిగారు. క్యూఆర్ కోడ్ పంపియ్యగా ఒకసారి రూ. 6850, మరోసారి రూ. 8860 ఫోన్‌పే ద్వారా పంపించాడు. అయినా డబ్బులు జమ కాకపోగా. మరుసటి రోజు మరింత మొత్తం చెల్లించాలని చెప్పడంతో అనుమానం వచ్చి వనపర్తిటౌన్ పీఎస్‌లో రిపోర్ట్ చేశాడు. ఈ కేసుపై విచారణ చేసిన పోలీసులు మొత్తం ఏడుగురు నిందితులను జనవరి 5న అరెస్టు చేశారు. సోడే కృష్ణకుమార్, కొత్త ఆంజనేయులు, జనుంపల్లి నితీష్‌కుమార్‌రెడ్డి, ఆగుపోగు మహేష్, సోడే భాను, దోసల నవీన్‌కుమార్‌రెడ్డి, మోరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డిని విచారించగా కోల్‌కతా, ఢిల్లీకి చెందిన అంకిత్, రాహుల్, పంకజ్‌ల శిక్షణలో ఈ మోసాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. ముద్రా, ధని లోన్ యాప్‌ల ద్వారా సేకరించిన కస్టమర్ల వివరాలను ఎక్సెల్ ఫైల్ తీసుకొని వారు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ద్వారా ఫోన్ చేసి మోసాలకు పాల్పడిన తర్వాత ఫోన్ స్విచాఫ్ చేసేవారమని ఒప్పుకున్నారు.

ఈజీ మనీకి అలవాటు పడటంతోనే మోసాలు

బిహార్, కోల్‌కతాలకు చెందిన ముఠాలు స్థానికంగా ఎక్కువగా చదువుకోని యువతను ఈ సైబర్ మోసాల్లో భాగస్వాములను చేస్తున్నాయి. ఒకరు వెళ్లి కొన్ని డబ్బులు సంపాదించిన తర్వాత మిగతా వారిని కూడా వారి దగ్గరి బంధువులే ఇందులోకి లాగి డబ్బులు వస్తాయని ఆశ చూపుతున్నారు. అన్నీ ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్స్ కాబట్టి రికార్డు అవుతాయి. జైలు శిక్ష కూడా తప్పదు. ఈ యువకులకు అది అర్థం కావడం లేదు. అలాగే ఈ నేరాల వల్ల వచ్చిన సంపాదన కూడా వారి వద్ద ఉండదు. సమాజంలో దొంగలుగా ముద్ర వేసుకోవాల్సి ఉంటుంది. వారి కుటుంబాలు కూడా తలెత్తుకొని తిరగలేవు. కాబట్టి ఈజీ మనీకి యువత అలవాటు పడొద్దు.

- రావుల గిరిధర్, ఎస్పీ వనపర్తి

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

- కేసు వివరాలు వెల్లడించిన జడ్చర్ల సీఐ కమలాకర్
- జడ్చర్ల మునిసిపాలిటీలోని రాజీవ్‌నగర్‌లో ఘటన

6

సెక్షన్ అధికారిపై వేటుకు రంగం సిద్ధం?

- ఆయన అక్రమాలకు అంతేలేదు..
- షాక్‌కు గురవుతున్న జిల్లా అధికారులు

7



చెట్ల మొదలు వద్ద పెట్రోల్ పోసి తగుల బెడుతున్న కూలీలు

వనపర్తిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతా

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

7



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న శివసేనారెడ్డి , ఎమ్మెల్యే మేఘారెడ్డి

సంక్షేమానికి పెద్దపీట

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



పెద్దాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

కందనూలు, తెలకపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దాపూర్, తెలకపల్లి మండలంలోని గౌరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు చేసిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కూడా అర్హులందరికీ విడతల వారీగా ఇస్తామని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని పదేళ్లుగా మాయ మాటలతో ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇళ్లు మంజూరు చేయడమే కాకుండా నేడు ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశామని అన్నారు. అదేవిధంగా తెలకపల్లి మండలంలోని గట్టునెల్లికుదురు గ్రామంలో బస్టాండ్, సీసీ రోడ్డు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మార్కెట్ చైర్మన్ రమణారావు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వినోద్, హౌసింగ్ డీఈ హరినాయక్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీవో వెంకట్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

లిఫ్ట్

అమరచింత లిఫ్టులోని మోటార్లు



- ఆదర్శ ఎత్తిపోతలగా 'అమరచింత'
- ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం

7

గట్టులో గుట్టుగా భూ దందా?



గట్టు తహసీల్దార్ కార్యాలయం

- బతికుండగానే మరణ ధ్రువీకరణ పత్రం జారీ
- 5 ఎకరాల 18 గుంటల భూమికి ఎసరు
- పంపకాల్లో తేడా రావడంతో విషయం వెలుగులోకి..
- దిద్దు బాటు పనిలో అధికారులు
- అక్రమ రిజిస్ట్రేషన్ యత్నంపై పోలీసులకు ఫిర్యాదు

6

పర్యాటక అభివృద్ధికి కృషి

- చంద్రఘడ్ కోట తక్షణ అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు
- పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పరిశోధన చేయిస్తా
- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు

అమరచింత/ఆత్మకూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చంద్రఘడ్ కోటపై పురావస్తు శాఖ వారితో పరిశోధన చేయించి పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. ఆదివారం రాత్రి వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని చంద్రఘడ్ కోటను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు కోట పై భాగంలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కోనేరులను పరిశీలించారు. కోట అభివృద్ధికి తక్షణమే రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే పర్యాటక అభివృది పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారని తెలిపారు. జూరాల ప్రాజెక్టు సమీపంలో ఉన్న చంద్రఘడ్ కోటను ఎమ్మెల్యే చెప్పిన విధంగా పర్యాటక అభివృద్ధి చేసి తీరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆత్మకూరు పరమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి నిమిత్తం తక్షణమే రూ.25 లక్షలు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కల్లుగీత విభాగం రాష్ట్ర చైర్మన్ నాగరాజుగౌడ్, ఆర్డీవో, డీఎస్పీ, ఆత్మకూరు తహసీల్దార్ చాంద్‌పాషా, ఆయా శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలను కాల్చి పైశాచిక ఆనందం

- పల్లెల్లో పెరుగుతున్న విష సంస్కృతి
- రెండు గ్రామాల్లో 50 క్వింటాళ్ల ఎండుమిర్చికి నిప్పుపెట్టిన దుండగులు
- కల్లాల వద్ద పంటనిల్వలు ఉంచాలంటే భయపడుతున్న రైతులు



తూంకుంట గ్రామంలో కాలిబూడిదైన 40 క్వింటాళ్ల ఎండుమిర్చి (ఫైల్)

అయిజ టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కల్మశం లేకుండా జీవనవిధానం కొనసాగించేవారు. కానీ నేడు డబ్బుపై వ్యామోహం, మద్యానికి బానిసలు కావడంతో కొన్ని గ్రామాల్లో విషసంస్కృతి విస్తరిస్తోంది. ఎదుటి వారు ఎదుగుతుంటే ఓర్వలేకపోతున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులు పండించిన పంటకు నిప్పు పెడుతున్నారంటే పల్లెల్లో ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం, తొత్తినోనిదొడ్డి గ్రామానికి చెందిన బార్కి భీమన్న కల్లంలో నిల్వ ఉంచిన మిర్చి పంటకు జనవరి 28న నిప్పుపెట్టి తీవ్ర నష్టం కలిగించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తనకున్న 3 ఎకరాల పొలంలో పండిన మిర్చి పంటను గ్రేడింగ్ చేసి, భోజనం కోసం ఇంటికి వచ్చిన సమయంలో మిట్ట మధ్యాహ్నం మిర్చి పంటకు నిప్పుపెట్టగా అందులో 10 క్వింటాళ్లు కాలిపోయింది. ఈ సంఘటనతో రైతు సుమారుగా రూ 1.50 లక్షలు నష్టపోయాడు. ఫిబ్రవరి 27న అయిజ మండలం, తూంకుంట గ్రామానికి చెందిన అలీపీరా అనే రైతు కల్లంలో ఉన్న 40 క్వింటాళ్ల మిర్చి కుప్పకు రాత్రి నిప్పంటించారు. ఈ ప్రమాదంలో రైతుకు సుమారుగా రూ 4 లక్షల ఆస్తినష్టం జరిగింది. ఇలా గ్రామాల్లో మంచిగా బతికే రైతుల కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీస్తున్నారు. దీంతో పంట ఉత్పత్తులను కల్లాల్లో నిల్వ ఉంచాలంటే భయపడుతున్నారు. పండిన పంటను ఇళ్ల వద్ద నిల్వ ఉంచుకోవాలంటే సరిపడా స్థలాలు ఉండవు. రాత్రిపగలు పంట ఉత్పత్తులకు కాపాలా ఉండేందుకు రైతు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల ఈ సంఘటనలపై ప్రత్యేక దృష్టి సారించి ఇటువంటి చర్యలు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.



తొత్తినోనిదొడ్డిలో కాలిపోతున్న మిర్చి కుప్ప (ఫైల్)

విచారణ చేస్తున్నాం

తూంకుంట గ్రామంలో ఎండుమిర్చి కుప్పకు నిప్పుపెట్టిన వ్యవహారంపై విచారణ జరుగుతోంది. రైతు ఫిర్యాదు మేరకు అనుమానితులను గుర్తించేపనిలో ఉన్నాం. రాత్రిళ్లు ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం.

- శ్రీనివాసరావు, ఎస్సై అయిజ

ఆధ్యాత్మిక సాధనకు కృషి చేస్తున్న పీఠాధిపతులు

● మంత్రి జూపల్లి కృష్ణారావు



గోశాల వద్ద పూజలు చేస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే శ్రీహరి, పంచమసిద్ధిలింగ మహాస్వామి

మాగనూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కనుమరుగవుతున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సంప్రదాయాలను కాపాడి వాటి సాధనకు పీఠాధిపతులు, మఠాధిపతులు కృషి చేస్తు ముందుంటున్నారని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా మాగ నూరు మండలం నేరడగమ్ము గ్రామంలోని శ్రీపశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠంలో మూడవ పంచమ సిద్ధలింగ మహాస్వామి 60వ పుణ్యతిథి జాతర మహోత్సవాలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మఠంలోని గోశాలను, అనాథ ఆశ్రమాలయానికి ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అన్నదాన సత్రం నిర్మాణం కోసం రూ.50 లక్షల నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి అన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ విదేశీ సంస్కృతికి అలవాటు పడుతున్న ప్రజలను ఆధ్యాత్మికం వైపు నడిపించుట కోసం పంచమసిద్ధ లింగ మహాస్వామి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మఠం అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికి ఉంటాయని ఎమ్మెల్యే అన్నారు. కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ ఎమ్మెల్యే శరణుగౌడ్ మఠం అభివృద్ధి కోసం తన వంతు సహాయం చేస్తానని పేర్కొన్నారు. అంతకు ముందు సిద్ధలింగ స్వామి మంత్రి జూపల్లితో పాటు, వేదిక మీద ఉన్న పెద్దలకు శాలువా, మెమెంటోలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో వివిధ మఠాలకు చెందిన పీఠాధిపతులు, మక్తల్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, బాల కృష్ణారెడ్డి, గణేష్, చంద్రకాంత్‌గౌడ్, మాజీ సర్పంచు అశోక్‌గౌడ్, ఆర్.విద్యాసాగర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎల్లారెడ్డి, వాకిటి మల్లేష్, ఎం.నాగ రాజు, ఆర్డీవో పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి ● రైతులకు స్ప్రింక్లర్ల పంపిణీ



రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్ర ఎంపీడీవో కార్యాలయంలో దేవరకద్ర, చిన్నచింతకుంట, కౌకుంట్ల, అడ్డాకుల, భూత్పూర్, మూసాపేట్ మండలాలకు చెందిన రైతులకు స్ప్రింకర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద రైతులు సాగు చేసుకున్న పంటలకు ఐడీబీ సమావేశం ఏర్పాటు చేసి, పాత ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొట్టి నీరు అందడం లేదని మాట్లాడటం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కొత్త ఆయకట్టుకు నీరు తీసుకొచ్చారా అని అన్నారు. షెడ్యూల్ ప్రకారం నీరు అందించి పంటలను కాపాడుతామన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పంథా మార్చిన సైబర్ నేరగాళ్లు

(5వ పేజీ తరువాయి)

ఉన్న దాదాపు 150 మందిని గుర్తించగా నెల రోజుల వ్యవధిలో వనపర్తి జిల్లా పోలీసులు 32 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షిఖా గోయల్ ఆధ్వర్యంలో నిందితులను గుర్తించి అరెస్టులు కొనసాగుతున్నాయి. నిందితుల్లో ఎక్కువ మంది నిరుపేదలు కావడం గమనార్హం. సైబర్ నేరాల్లో భాగస్వాములు అయిన తర్వాత వారి లైఫ్ స్టైల్ మారడం, ఇళ్లు నిర్మించుకోవడం, కార్లు కొనుగోలు చేయడం, డబ్బులు విరివిగా ఖర్చు చేస్తుండటంతో మిగతా యువకులు, పరిచయస్తులు కూడా వారు చేసే పనుల పట్ల ఆకర్షితులవుతున్నారు. బిహార్ ముఠాలు కూడా ఏ ప్రాంతం వారిని మోసం చేయడానికి ఆ ప్రాంతం యువతనే రిక్రూట్ చేసుకుంటున్నారు.

స్థానిక లొకేషన్స్ ఆధారంగా గుర్తింపు...

లోకల్ రిక్రూట్‌మెంట్స్ దాదాపు కరోనా కాలం నుంచి కొనసాగుతున్నప్పటికీ స్థానికంగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వారిని గుర్తించలేదు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మూసాపేట మండలం సూర్తి తండా, చక్రాపూర్, కనకాపూర్ తండా నుంచి ఈ రిక్రూట్‌మెంట్ ఆజ్యం పోసుకుందని సమాచారం. ఒక్కొక్కరుగా ఇప్పుడు వందల సంఖ్యలో యువకులు నేరాల్లో భాగస్వాములుగా మారారు. స్థానిక యువకులను మొదట బిహార్‌కు తీసుకెళ్లి అక్కడ శిక్షణ ఇస్తారు. ఆ సమయంలోనే గంజాయి, ఇతర మత్తు పదార్థాలను అలవాటు చేస్తారు. ఇది తప్పని భావించిన వారిని తప్పించుకోకుండా చూసుకుంటారు. ఎదురు తిరిగితే చంపడానికి కూడా వెనుకాడరు. ఈ క్రమంలో మోసం చేయడం ద్వారా వచ్చిన సొమ్మును మెయిన్ హెడ్‌కు 50 శాతం, మిడిల్ మెన్‌కు 25 శాతం, ఎవరైతే ఆ మోసానికి పాల్పడ్డారో వారికి 25 శాతం చొప్పున పంచుకుంటారు. నాలుగేళ్లుగా ఈ రిక్రూట్‌మెంట్ కొనసాగుతున్నప్పటికీ బీహార్ జామ్‌తారాలో చాలా రోజుల నుంచి ఈ తరహా మోసాలు జరగడం పరిపాటి. అక్కడకు వెళ్లి ఇన్వెస్టిగేషన్ చేసేందుకు పోలీసులు కూడా జంకుతారు. గతంలో ముగ్గురు యువకులు ఈ మోసాలకు ఎదురుతిరిగి చనిపోయినప్పుడు కూడా అక్కడికి వెళ్లి విచారణ చేయలేకపోయారు. అయితే ఈ కేసుల్లో మొదట కరీంనగర్ నుంచి ఒక మోసాన్ని గుర్తించగా నిందితుడు వాడిన ఫోన్ లొకేషన్ వనపర్తి అని చూపించింది. వారు ఇక్కడకు సమాచారం ఇచ్చినప్పటికీ అటవీ ప్రాంతాల్లో, కలెక్టరేట్ వెనుక ఉన్న నిర్మానుష్య ప్రాంతాల్లో లొకేషన్ చూపించింది. అ సమయంలో అదే తరహా మోసం వనపర్తి జిల్లా కొత్తకోటలో నమోదైంది. మోసానికి వాడటానికి ఉపయోగించిన ఫోన్‌కు నిందితుడి పర్సనల్ ఫోన్ ద్వారా నెట్ కనెక్టివిటీ చేసుకున్నారు. దీంతో కేసును ట్రేస్ చేయగా పెద్దమందడి మండలంలోని తండావాసులుగా గుర్తించారు. వారిని అరెస్టు చేశారు. ఆ తర్వాత తీగ లాగితే డొంక కదిలినట్లు ఇప్పటివరకు అదే తరహా మోసాల్లో ఉమ్మడి జిల్లా పరిధిలో 32 మందిని నెలరోజుల వ్యవధిలో అరెస్టు చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ రిక్రూట్‌మెంట్ ఉన్నదని, తమిళనాడు, కేరళ లలో కూడా ఈ ముఠా రిక్రూట్‌మెంట్లు కొనసాగిస్తోందనే సమాచారం ఉన్నదని వనపర్తి సైబర్ క్రైం డీఎస్పీ ఎస్‌బీ రత్నం తెలిపారు.

మోసాలు ఇలా చేస్తారు...

మొదట చాలామంది హిందీలో ఫోన్‌కాల్స్ చేసి సైబర్ నేరాలకు పాల్పడేవారు. ఇలాంటి నేరాలపై ఒక సిరీస్ కూడా జామ్‌తారా పేరుతో ఉన్నది. ఆ తర్వాత ఫోన్ ఎత్తి హిందీలో సంభాషణ వినిపించగానే అవగాహన పెరిగిన ప్రజలు కట్ చేస్తున్నారు. వీటితో పాటు ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, వాట్సాప్ ఫేక్ ప్రొఫైల్స్ క్రియేట్ చేసి డబ్బులు అడిగేవారు కూడా ఉన్నారు. హిందీలో మాట్లాడి మోసాలకు పాల్పడటం కష్టం కావడంతో ప్రాంతాల వారీగా లోకల్స్‌ను రిక్రూట్ చేసుకుంటున్నారు. ముద్ర లోన్లు, ధని యాప్ ద్వారా లోన్లు ఇస్తామని ముందుగా నమ్మిస్తారు. మాట్లాడే వారు చుట్టుపక్కల యాసతోనే మాట్లాడుతుండటంతో బాధితులు కూడా మోసపోతున్నారు. తర్వాత యాప్ లింక్ ఇచ్చి వివరాలు తీసుకుంటారు. ఒక ఫేక్ లెటర్ హెడ్ ప్రధాన మంత్రి ఫొటోతో ఉన్నది క్రియేట్ చేసి లోన్ మంజూరైందని పంపిస్తారు. తిరిగి చెల్లించాల్సిన వాయిదాల షెడ్యూల్ కూడా నెలనెలా ఎంత చెల్లించాలో పంపిస్తారు. దీంతో వాటిని నమ్మిన తర్వాత ఒకవేళ లోన్ తీసుకున్న తర్వాత వ్యక్తి మరణిస్తే కుటుంబంపై భారం పడకుండా లోన్‌పై ఇన్సూరెన్స్ చేస్తామని, లోన్ ప్రాసెసింగ్ రుసుం, టీడీఎస్, జీఎస్టీ పేరుతో అమౌంట్ చెల్లించాలని కోరుతారు. బాధితుడు చెల్లించడానికి సిద్ధమైన తర్వాత బిహార్‌లోని మెయిన్ పార్టీకి చెప్పి అకౌంట్ నెంబర్లు, క్యూఆర్ కోడ్ ద్వారా వాటిని చెల్లిస్తారు. ఆ మొత్తం నుంచి స్థానికంగా మోసానికి పాల్పడిన వ్యక్తికి 25 శాతం సొమ్మును చెల్లిస్తారు. అయితే ఈ కేసుల్లో పట్టుబడుతున్న వారు స్థానిక లొకేషన్స్‌లో ఉండి ఆపరేట్ చేయడం లేదా మెయిన్ పార్టీ అకౌంట్ నెంబర్ కాకుండా సొంత అకౌంట్ నెంబర్లు ఇవ్వడంతో పోలీసులు పట్టుకుంటున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.నాలుగు కోట్లు ఈ లోకల్ రిక్రూట్‌మెంట్ ద్వారా కాజేసినట్లు అంచనా వేస్తున్నారు. ఇంకా తవ్వేకొద్ది అక్రమాల చిట్టా వెలుగులోకి వస్తూనే ఉన్నది. ముఖ్యంగా ఈ మోసాలకు రిక్రూట్ అవుతున్న ప్రాంతాల్లో పోలీసులు ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు చేపడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తెలియని నెంబర్ నుంచి ఫోన్ రావడంతో..

వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం పొలికెపాడుకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తికి ఒక తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ధని యాప్ ద్వారా లోన్‌కు అర్హత పొందారు. అవసరం ఉన్నదా అని అడగ్గా, తనకు అవసరం ఉన్నదని చెప్పి వివరాలు ఇచ్చారు. లోన్ డబ్బులు మీ అకౌంట్‌లో జమ కావాలంటే ఇన్సూరెన్స్, టీడీఎస్, ప్రాసెసింగ్ చార్జీలు, జీఎస్టీ ముందుగానే చెల్లించాలని చెప్పడంతో నిజమేనని చెప్పి తన బ్యాంకు అకౌంట్ పనిచేయకపోవడంతో తన బావ అయిన శివను లోన్ మంజూరైంది. కొన్ని డబ్బులు కట్టాలి. వచ్చిన వెంటనే తిరిగి చెల్లిస్తానని చెప్పారు. బావ అకౌంట్ నుంచి 2024 నవంబరు 29న విడతల వారీగా తెలియని వ్యక్తి పంపిన క్యూఆర్ కోడ్లకు రూ. 32,135 పంపించారు. ఇంకా డబ్బులు పంపమని అడుగుతుండటంతో అనుమానం వచ్చి సైబర్ పోర్టల్ 1930కి ఫోన్ చేసి రిపోర్టు చేశారు. గోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేశారు. అప్పటికే ఇలాంటి కేసుల దర్యాప్తులో ఉన్న పోలీసులు మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం సూర్తి తండాలో నరేష్ నాయక్, వెంకటేష్ నాయక్, చందు నాయక్‌ను అరెస్టు చేశారు. తర్వాత అదే తండా చెందిన తాజా కేసు నిందితుడు కట్రావత్ వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. తమ తండాలకు చెందిన చాలా మందిమి బృందంగా ఏర్పడి మోసాలు చేస్తున్నట్లు, బిహార్, కోల్‌కతా, ఢిల్లీకి చెందిన పంకజ్ కుమార్, సునీల్‌కుమార్, షంబూ, కార్తీక్, వివేక్, కుషవాహల ఆదేశాలు, శిక్షణతో ఈ నేరాలు చేసినట్లు ఒప్పుకున్నారు.

ప్రియుడితో కలిసి
భర్తను హత్య చేసిన భార్య

● కేసు వివరాలను వెల్లడించిన జడ్చర్ల సీఐ కమలాకర్

● జడ్చర్ల మునిసిపాలిటీలోని రాజీవ్‌నగర్‌లో ఘటన

జడ్చర్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రియుడితో కలిసి భర్త మీనుగ కోటయ్య (50)ను భార్య మీనుగ అలివేలు హత్య చేసిందని జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి విషయాన్ని ఆదివారం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేట సమీపంలోని రాజీవ్‌నగర్‌కాలనీలో మీనుగ కోటయ్య, భార్య మీనుగ అలివేలు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. అలివేలు వరుసకు అల్లుడు అయిన మీనుగ రాజ్‌కుమార్ అలియాస్ ఎనుముల రాజ్‌కుమార్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలిసి ఆమె భర్త మందలించాడు. జనవరి 23న షాద్‌నగర్‌లో ఓ ఫంక్షన్‌కు మీనుగ కోటయ్య వెళ్లాడు. అదే రోజు రాత్రి కోటయ్యకు చెందిన పాత ఇంట్లో వారిరువురు కలిసి ఉండటం చూసిన అతడు గొడవపడ్డాడు. ఇదే సందర్భంలో కోటయ్యను కింద పడేసి, చున్నీతో మెడకు చుట్టి హత్య చేశారు. అనంతరం సహజంగానే మృతి చెందాడని అందరినీ నమ్మించే విధంగా ఇంట్లో పడుకోబెట్టి వారిద్దరు వెళ్లిపోయారు. కొంత సమయం గడిచిన తర్వాత తన పిల్లలను, బంధువులను నిద్రలేపి తన భర్త కోటయ్య అర్ధరాత్రి అయినా ఇంటికి రాలేదని వెతికారు. పాత ఇంట్లో అచేతనంగా పడి ఉన్న కోటయ్యను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతిపై అనుమానం ఉందంటూ సోదరుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా గొంతునులిమి చంపినట్లుగా తేలింది. విచారణలో నిందితులు కోటయ్యను హత్య చేసినట్లుగా ఒప్పుకున్నారని సీఐ కమలాకర్ వివరించారు. వీరిని ఆదివారం అరెస్ట్ చేసి, రిమాండ్ చేసినట్లు చెప్పారు.


సాంకేతిక విద్యే లక్ష్యం

పీఎంశ్రీ పథకంలో పాఠశాలలకు చేరిన ట్యాబ్‌లు



పులికల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చేరిన ట్యాబ్‌లు

అయిజ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు సాంకేతిక విద్య అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. ఇందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాయి. 'పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మొదటి, రెండో విడతలో 22 పాఠశాలలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఇప్పటికే ప్రత్యేక తరగతి గదులు, వసతులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నారు. ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్టు అంశాలను నేరుగా తమ చేతుల్లో ఉన్న ట్యాబులపై చూసే అవకాశం కల్పించారు. అందుకు గాను ఎంపిక చేయబడిన పాఠశాలలకు ట్యాబ్‌లు నేరుగా పంపిస్తున్నారు. ఇప్పటికే అయిజ మండలంలో పీఎం శ్రీ పథకం కింద ఎంపికచేసిన పులికల్, అయిజ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ట్యా బ్‌లు చేరాయి. ఒక్కొక్క పాఠశాలకు 25 ట్యాబులను అందజేశారు. వీటిని 8,9,10 తరగతుల విద్యార్థులకు అందజేయనున్నారు. పాఠ్యాంశాలు బోధించే సమయంలో విద్యార్థులకు అందజేయనున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో రెండో విడతలో ఎంపిక చేసిన 12 పాఠశాలలకు 300 ట్యాబులు వచ్చినట్లు సమాచారం.



ట్యాబ్‌ను చూయిస్తున్న పులికల్ పాఠశాల హెచ్‌ఎం ఉషారాణి

పాఠశాలలకు చేర్చుతున్నాం



పీఎంశ్రీ పథకంలో భాగంగా ఎంపికచేయబడిన పాఠశాలలకు ట్యాబ్‌లు చేరుస్తున్నాం. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించే సమయంలో వీటిని విద్యార్థుల ద్వారా ఉపయోగిస్తారు. పాఠ్యాంశాలలోని సమస్యలను ట్యాబ్‌ల సులభంగా ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది.

- మహ్మద్ అబ్దుల్‌ఘని, ఇన్‌చార్జి డీఈవో

గట్టులో గుట్టుగా భూ దందా?

» బతికుండగానే మరణ ధ్రువీకరణ పత్రం జారీ

» 5 ఎకరాల 18 గుంటల భూమికి ఎసరు

గట్టు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : భూ అక్రమ రిజిస్ట్రేషన్ కోసం బతికున్న కుటుంబ సభ్యులను మరణించినట్లు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. ఈ విషయం జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఇందువాసి గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. దళారులు, అధికారులు వేసిన పథకంలో పంపకాలలో తేడాలు రావడంతో భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం బయటకు పొక్కింది. ఎప్పుడో మృతి చెందిన వ్యక్తిని 2019లో మరణించినట్లు, బతికున్న కుటుంబ సభ్యులు కూడా మృతి చెందినట్లు మరణ ధ్రువీకరణ పత్రం తీసుకొని 5ఎకరాల18 గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి భారీ పథకం వేశారు. రిజిస్ట్రేషన్ అవుతోందన్న సమయంలో అసలు వారసులు రంగంలోకి దిగడంతో అధికారులు కంగుతిన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

పథకం ఇలా ..

ఇందువాసి గ్రామ శివారులోని సర్వే నంబరు 385/బి/1లో 5ఎకరాల 18 గుంటల పట్టా పొలం ఉన్నది. ఈ పొలం గ్రామానికి చెందిన హరిజన మత్తయ్య పేరుపై ఉన్నది. ఆయనకు ఇద్దరు (ప్రకాష్, గోర్లన్న) కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన చాలా కాలంకింద మృతి చెందారు. ఆయన కుమారులు ఈ భూమిని తమ పేర్లపై మార్చుకోలేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామానికి చెందిన కొందరు దళారులు బినామీ వ్యక్తి పేరుపై పొలాన్ని బదలాయించడానికి తప్పుడు రికార్డులు సృష్టించారు. మత్తయ్య 9/3/2019లో మృతి చెందినట్లు మరణ ధ్రువీకరణ పత్రం తీశారు. పొలం విరాసత్ కావాలంటే కుటుంబ సభ్యుల ధ్రువపత్రం అవసరం. ఇందుకుగాను అధికారులను మచ్చిక చేసుకుని మృతి చెందిన మత్తయ్య కుటుంబ సభ్యులు కాకుండా బినామీ కుటుంబ సభ్యులు బతికున్నా వారు మృతి చెందినట్లు ధ్రువీకరణ పత్రంలో పొందపరిచి సర్టిఫికేట్‌ను గట్టు తహసీల్దార్ కార్యాలయం నుంచి 16/11/2024లో తీసుకున్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ కోసం శ్లాట్ బుక్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఈ వ్యవహారం అసలు వారసులకు తెలియడంతో వారు వచ్చి రిజిస్ట్రేషన్ దగ్గర పేచి పెట్టడంతో తప్పుడు రికార్డుల విషయం బయట పడింది. దీంతో అక్రమ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిలిచిపోయింది.

రిజిస్ట్రేషన్ నిలుపుదల చేశాం

ఇందువాసిలోని భూమి రిజిస్ట్రేషన్ విషయం తన దృష్టికి రావడంతో నిలుపుదల చేశాం. గత అధికారిణి ఉన్న సమయంలో, ఆర్ఐ చేసిన పొరపాటు వల్ల ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేశారు. తన దృష్టికి రావడంతో సర్టిఫికెట్ క్యాన్సిల్ చేయమని కలెక్టర్‌కు, ఆర్డీవోకు రిపోర్ట్ చేశాం. ఎవరైనా సరే తప్పుడు సర్టిఫికెట్‌లతో స్లాట్ బుక్‌చేస్తే చర్యలు తప్పవు.

- ఎండీ సలీముద్దీన్, తహసీల్దార్ గట్టు

పాలమూరు-డిండీ ప్రాజెక్టుతో తీరని నష్టం

- ఈ ప్రాంత పాలకులు, ప్రతిపక్షాలు ప్రశ్నించాలి

- విలేకరుల సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి



మాట్లాడుతున్న రాఘవాచారి

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లాకు నీళ్లను తరలించేందుకు ప్రతిపాదిత పాలమూరు-డిండీ ప్రాజెక్టుతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీరని నష్టం జరుగుతుందని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు మందిరంలో రాఘవాచారి విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పాలమూరు- డిండీ ప్రాజెక్టు ద్వారా ఏదుల నుంచి నల్లగొండ జిల్లాకు నీళ్ల తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 22న రూ.18వేల కోట్లతో జీవో నెంబరు 11 ఇచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికే దశాబ్దాల కాలంగా నిర్లక్ష్యానికి గురవుతూ వస్తున్న పాలమూరు జిల్లా ఈ ప్రాజెక్టుతో మరింత వెనుకబాటుకు గురికాక తప్పదన్నారు. ఉమ్మడి జిల్లాలో కట్టిన జూరాల ప్రాజెక్టు ఇప్పటికీ నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో పూర్తి చేసుకోలేదని, కేఎల్ఐ ప్రాజెక్టుకు నేటికీ డిస్ట్రిబ్యూటరీలు లేవన్నారు. అలాంటిది ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఒకటిన్నర టీఎంసీతో నిర్మిస్తున్నారని, అందులో నుంచి అర టీఎంసీ నీళ్లు డిండీ ద్వారా నల్గొండ జిల్లాకు తీసుకుపోతే పాలమూరుకు మిగిలేదేంటని ఆయన ప్రశ్నించారు. నల్గొండకు సాగునీరు కావాలనుకుంటే ఇప్పటికే ఉన్న సాగర్ ఎడమ కాలువ ద్వారా అవసరమైన నీటిని తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో పలుకుబడి కలిగిన పాలకులు ఉన్న నల్గొండ జిల్లాకు ఇటీవలే 4 ఎమ్మెల్సీ సీట్లు తీసుకుపోయారని, నీళ్ల విషయంలో కూడా పాలమూరు- డిండీతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్ర నష్టం చేకూరుస్తారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాకు జరిగే నష్టంపై ఇక్కడి పాలకులు, ప్రతిపక్షాలు నోరు మెదపడం లేదని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలకు పాలమూరు- డిండీ ప్రాజెక్టుపై స్పందించకపోతే వారి స్వప్రయోజనాలే ముఖ్యమని, దీనివల్ల ప్రజలకు కలిగే నష్టంపై అవగాహన లేదని భావించాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర బిందువుగా ఉన్న నాగర్‌కర్నూల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి స్పందించి దీనిపై ప్రభుత్వంతో చర్చించించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, కృష్ణ, ఉపాధ్యాయ సంఘం నాయకుడు మద్దిలేటి, పాలమూరు అధ్యయన వేదిక సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

- ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.జబ్బార్



మాట్లాడుతున్న ఎండీ.జబ్బార్

నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.జబ్బార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో 'రాజ్యాంగ పరిరక్షణ- వక్ఫ్ బిల్లు' అనే అంశంపై మైనార్టీ నాయకులతో పౌర చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బిల్లుపై జేపీసీలో ప్రతిపక్ష సభ్యులు సూచించిన ఒక్క సవరణ కూడా ఆమోదించకుండా నియంతృత్వంగా ఆమోదించడం సరైంది కాదన్నారు. మంద బలంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాలను ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఖండించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర నాయకుడు అబ్దుల్లా ఖాన్, మైనార్టీ హక్కుల సాధన సమితి నాయకుడు నిజాం, అమీద్, సలీం, అనీష్, వహీద్‌ఖాన్, మహ్మద్ జమాలుద్దీన్, మహ్మద్ పాషా, రహీం తదితరులు పాల్గొన్నారు.


వలస కూలీని
చంపిన మొసలి

గద్వాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని గుర్రంగడ్డ బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద ఓ వలస కూలీని మొసలి చంపేసింది. ఈ సంఘటన ఆదివారం వెలుగు చూసింది. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంగడ్డ బ్రిడ్జి నిర్మాణ పనులకు ఉత్తరప్రదేశ్‌కు చెందిన కూలీలు మూడు నెలల క్రితం వలస వచ్చారు. హోలీ పండుగ శుక్రవారం రోజు కూలీలందరూ సంతోషంగా రంగులు చల్లుకొని హోలీ ఆడారు. అందరూ స్నానాలు చేసి నది ఒడ్డునే క్యాంపునకు వెళ్లారు. మనీషా (21) అనే యువకుడు మాత్రం నీటి మడుగు దగ్గర పడుకొని ఫోన్ మాట్లాడుతూ ఉండటంతో తర్వాత వస్తాడని భావించారు. కానీ మద్యం సేవించి మైకంలో అక్కడే ఉండిపోయిన మనీషాను ఓ మొసలి అకస్మాత్తుగా నీటి లోకి లాగేసుకపోయింది. తోటి కూలీలు శనివారం ఉదయం లేచి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. కానీ ఆచూకీ లభించలేదు. ఆదివారం గ్రామానికి చెందిన ఓ రైతు నీటి మడుగు దగ్గరకు వెళ్లగా, ఓ మొసలి మనిషి శరీర భాగాలను తింటుండటం గమనించి, సమీపంలోనే ఉన్న కూలీలకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు మడుగు దగ్గరకు చేరుకొని రాళ్లు విసిరి మొసలిని తరిమేశారు. అది అప్పటికే మనిషి శరీర భాగాలలో చాలా వరకు తినేసింది. ఈ మేరకు బంధువులు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో
మైసమ్మ దేవతకు పూజలు

పెద్దకొత్తపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతకు భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20వేల మంది భక్తులు మైసమ్మ దేవతను దర్శనం చేసుకున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో మైసమ్మ దేవతకు పూజలు నిర్వహించారు. ఈ ఆదివారం మైసమ్మ ఆలయానికి టికెట్ల ద్వారా రూ.34,380, హుండీ ద్వారా రూ.86,239, మొత్తం రూ.1,20,619 ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామేశ్వర్ శర్మ తెలిపారు.

అలంపూర్ ఆలయాల్లో భక్తుల రద్దీ



జోగుళాంబ అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తుల రద్దీ

అలంపూరు మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తుంగభద్రలో స్నానమాచరించి, స్వామివారి ఆలయంలో గణపతిపూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు వంటి విశేష పూజలు చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన రిటైర్డ్ కార్యదర్శి పూనం మాల కొండయ్య దర్శించుకున్నారు. గణపతిపూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అర్చకులు సాదరస్వాగతం పలికారు.

వనపర్తిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతా

● రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వనపర్తిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ అండర్ 14 ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతలకు శివసేనారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ఉన్నత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారిస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చు అన్నారు. క్రీడాకారులందరూ గెలుపు ఓటములను సమానంగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 అడ్వాన్స్‌డ్ ఐటీఐ ఇన్‌స్టిట్యూట్‌లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా క్రీడాకారులకు తగు శిక్షణ ఇచ్చి తయారు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ... త్వరలోనే వనపర్తిలో ఫుట్‌బాల్ అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వనపర్తిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు చేయనున్నామని వివరించారు. దీంతో విద్యార్థులకు మూడవ తరగతి నుంచి పీజీ వరకు ఉన్నత విద్య అందించవచ్చని పేర్కొన్నారు. అండర్-14 బాలబాలికలకు నిర్వహించిన ఈ క్రీడల్లో 20 బాలికల జట్లు, 20 బాలుర జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో బాలికల్లో నిజామాబాద్ జిల్లాకు మొదటిస్థానం, ఆదిలాబాద్ జిల్లాకు రెండవ స్థానం, రంగారెడ్డి జిల్లాకు మూడో స్థానం లభించిందన్నారు. బాలుర జట్లలో మొదటి స్థానంలో హైదరాబాద్, రెండవ స్థానంలో మహబూబ్ నగర్, మూడవ స్థానంలో రంగారెడ్డి జట్లు ప్రతిభ కనబరిచాయని వివరించారు. వనపర్తి మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, సమన్వయకర్త లక్కాకుల సతీష్, జిల్లా క్రీడా శాఖ అధికారులు సుధీర్ కుమార్ రెడ్డి, సురేందర్ రెడ్డి, క్రీడాకారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

క్రైం కార్నర్

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

వెల్దండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేవాలయంలోని హుండీ దొంగతనం చేసి పరారవుతున్న దొంగను స్థానికుల సహకారంతో పోలీసులు అరెస్ట్‌చేయగా, మరొకరు తప్పించుకున్న సంఘటన ఆదివారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... జడ్చర్లకు చెందిన అరుణ్‌కుమార్, కల్వకుర్తికి చెందిన ఆంజనేయులు గత కొంతకాలంగా దేవాలయాలలో చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలోని శివాలయంలో హుండీని చోరీచేసే క్రమంలో గ్రామస్థుల సహకారంతో పోలీసులు అరుణ్‌కుమార్‌ను పట్టుకోగా, ఆంజనేయులు పరారయ్యాడు. పట్టుబడ్డ అరుణ్‌కుమార్ వద్ద షాద్‌నగర్‌లో దొంగిలించిన ద్విచక్ర వాహనంతో పాటు హుండీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు అయినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. అరుణ్‌కుమార్‌ను రిమాండ్ చేసినట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

వీపనగండ్ల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన గొల్ల నరసింహ (62)శనివారం రాత్రి చెరువులో చేపలు పట్టుకునేందుకు వెళ్లి మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. పోచమోని గొల్ల నరసింహ హమాలీ పని చేసుకుని జీవనం సాగించే వాడు. గ్రామ సమీపంలోని నాన్ చెరువులో చేపలు పట్టేందుకు రాత్రి 10 గంటల సమయంలో వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట ము నిగి మృతి చెందాడు. ఇంటికి రాకపోవడంతో ఆదివారం చెరువులో కుటుంబ సభ్యులు, గ్రామస్థుల సహకారంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం కనిపించడంతో బయటకు తీశారు. పోలీసులకు సమాచారం ఇ వ్వగా ఎస్‌ఐ రాణి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుమారుడు శ్రీనివాసు లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మృతి చెందిన నరసింహ

ఆటో బోల్తా పడి..

అచ్చంపేటటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వరుని దర్శించుకొని కొండ దిగుతుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్రాబాద్ మండల పరిధిలోని తెలుగుపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య ఓ శుభకార్యం నిమిత్తం అచ్చంపేట మండల పరిధిలోని ఉమామహేశ్వర కొండపైకి వెళ్లారు. శుభకార్యం అనంతరం కొండపై నుంచి తిరుగు ప్రయాణంలో ఆటోలో వస్తుండగా దిగువకు వచ్చే సమయంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న కొంత మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాగా వెంటనే 108లో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. తిరుపతయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోసుమార్టం కోసం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

కందనూలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన అవుట రంగయ్య(32) కన్పించడం లేదని అతని అన్న కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. కుమ్మెర గ్రామానికి చెందిన రంగయ్య భార్య పద్మతో గొడవ పడి శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే బంధువులు, చుట్టుపక్కల ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. రంగయ్యకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'తెలుగువారి ఐక్యతే అమరజీవికి నిజమైన నివాళి'

గద్వాల టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజలంతా ఐక్యతాభావంతో ఉండి రెండు తెలుగు రాష్ట్రాలు సర్వతోముఖాభివృద్ధి సాధించడమే అమరజీవి పొట్టి శ్రీరాములుకు నిజమైన నివాళి అవుతుందని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు ఆలూరు బిలకంటి రాము అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పాతబస్టాండ్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి నరహరి శ్రీనివాసులు, నందిమల్ల సురేష్, బాలస్వామి, అశోక్, పత్తిరత్నాకర్, బాణాల వెంకటరమణ, మరిడి శ్రీకాంత్, నందిమల్ల అశోక్, పచ్చి పులుసు రత్నాకర్, జగదీష్, బాణాల సునీల్, అల్లంపల్లి వెంకటేశ్వర్లు, ఇల్లూరి వేణు, కొండా రాఘవేంద్ర, తిరుమలేష్, ప్రకాష్, రంజిత్‌లు ఉన్నారు.



లిఫ్ట్

● ఆదర్శ ఎత్తిపోతలగా 'అమరచింత'

» ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం
» 25 ఏళ్లుగా నిర్విరామంగా కొనసాగుతున్న లిఫ్టు
» దాని కింద 4200 ఎకరాల ఆయకట్టు
» ఔరా అనిపించుకుంటున్న అమరచింత ఎత్తిపోతల రైతులు

ఎత్తిపోతలు అంటేనే ఎత్తిపోయే పరిస్థితులు గోచరిస్తున్న ఈ కాలంలో పాతికేళ్లుగా ఎలాంటి ఆటుపోట్లు లేకుండా నిర్విరామంగా కొనసాగుతున్న అమరచింత లిఫ్ట్ ఆదర్శంగా నిలుస్తోంది. 1997లో అప్పటి ప్రభుత్వం లిఫ్టుల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వగా దీని ఏర్పాటుకు పునాది పడింది. 1999లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. 4వేల పైచిలుకు ఎకరాల ఆయకట్టుకు రూ.6 కోట్ల 87 లక్షల అంచనాతో నిర్మాణం చేపట్టారు. ఇప్పటికీ ఎత్తిపోతల కింద సాగవుతున్న ఆయకట్టు కళకళలాడుతుండటం గమనార్హం.

● రైతుల భాగస్వామ్యంతో ముందుకు



అమరచింత ఎత్తిపోతల పథకాన్ని రైతులందరి భాగస్వామ్యంతో విజయవంతంగా నడుపుకుంటున్నాం. చిన్న చిన్న ఇబ్బందులు లిఫ్టు చిన్నపాటి మరమ్మతులు అయినా అందరం కలిసి పరిష్కరించుకుంటాం. కలిసికట్టుగా ఉన్నందువల్ల ఆయకట్టు కింద మంచి ఫలితాలు వస్తున్నాయి. తమ రైతులకు ప్రభుత్వ సహకారం అవసరం. తమ లిఫ్టుకు ఉమ్మడి రాష్ట్రంలోనే మంచి పేరు వచ్చింది.

- చిన్న ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి, అమరచింత ఎత్తిపోతల పథకం

అమరచింత, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రైతుల భాగస్వామ్యం, అధికారుల పర్యవేక్షణతో అమరచింత ఎత్తిపోతల పథకం ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శంగా కొనసాగుతున్నది. 1997లో అప్పటి ప్రభుత్వం లిఫ్టుల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వగా అమరచింత ప్రాంత రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అప్పటి ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి దాని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 4వేలకు పైగా ఎకరాల ఆయకట్టుకు 6 కోట్ల 87 లక్షల అంచనాతో 1999లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరచింత ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. నాబార్డు సహకారంతో లిఫ్టు పనులు పూర్తి చేసి ఒక సంవత్సరం పాటు ఐడీసీ అధికారుల నిర్వహణలో లిఫ్టు కొనసాగింది. 2000 సంవత్సరంలో ఐడీసీ అధికారులు ఆయకట్టులోని ఆయా గ్రామాల రైతులతో కమిటీ ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలను రైతులకు అప్పగించారు.

● ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శ లిఫ్టు

25 ఏళ్లుగా నిర్విరామంగా కొనసాగుతున్న అమరచింతలో ఎత్తిపోతల ఉమ్మడి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచింది. ఆయా గ్రామాల రైతులు పార్టీలకు అతీతంగా సమష్టి కృషితో లిఫ్టు నిర్వహణ చేస్తూ ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శ లిఫ్టుగా అవార్డు సైతం అందుకున్నారు.

● జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువకు అనుసంధానం

జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువకు అనుసంధానంగా అమరచింత ఎత్తిపోతల పథకానికి డిజైన్ చేసి నిర్మించారు. లిఫ్టు నిర్మాణానికి ముందు ఈ ప్రాంతంలో బీడుగా ఉండే పొలాలు ప్రస్తుతం ఈ లిఫ్టు రాకతో పొలాలతో పాటు రైతుల జీవితాలలో వెలుగు నిండిందని చెప్పవచ్చు. ప్రధాన ఎడమ కాలువ నుంచి పైప్‌లైన్ వేసుకోవడం వల్ల లిఫ్టు ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందుతుండటంతో ఎక్కువ సంఖ్యలో వరి పంటనే రైతులు సాగు చేస్తున్నారు. ఆయకట్టు రైతులు 25 ఏళ్లుగా ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా ఎత్తిపోతల నిర్వహణ కమిటీలను అందరి ఆమోదంతో వేసుకుంటారు. కమిటీ సభ్యులు తరచూ సర్వసభ్య సమావేశాలు నిర్వహించి చిన్న చిన్న రిపేర్లు, సిబ్బంది అమౌంట్ , లష్కర్లు, ఆపరేటర్లు, మెకానిక్‌ల నెలసరి వేతనాల ఖర్చు లక్షా 20వేల వరకు ఉంటుంది. ఇందుకు గాను ఆయకట్టు కింద ఉన్న ప్రతీ ఎకరానికి పంట కిస్తు రూ.1800 వసూళ్లు చేస్తారు. ఆ మొత్తం బ్యాంకులో జమ చేసి ఖర్చు మిగులు ఆర్డింగ్ చేయిస్తారు. ప్రస్తుతం బ్యాంకులో ఈ లిఫ్టుకు సంబంధించి దాదాపు 80 లక్షల దాకా ఎఫ్‌డీలు ఉన్నాయని తెలిసింది.


ఎత్తిపోతల పథకం పంప్ హౌజ్


లిఫ్టుకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం



అమరచింతలో ఎత్తిపోతల పథకం

● రైతుల సమన్వయంతో...

ఎత్తిపోతల పథకం పరిధిలో అమరచింత, మస్తీపూర్, పామిరెడ్డిపల్లి, సింగంపేట, మూలమళ్ల గ్రామాల పరిధిలో 4వేల పైచిలుకు ఆయకట్టు ఉంది. ఇందులో 1200 మంది దాకా రైతుల భాగస్వామ్యంతో లిఫ్టు విజయవంతంగా కొనసాగుతోంది. 2009లో అప్పటి ఎమ్మెల్యే స్వర్ణా సుధాకర్ రెడ్డి అమరచింత లిఫ్టు కాలువలకు లైనింగ్ పనుల శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కాలువల లైనింగ్ అయినప్పటికీ చిన్న చిన్న ఇబ్బందుల కారణంగా పూర్తిస్థాయి ఆయకట్టు నీరు అందకపోగా ప్రస్తుతం 2200 ఎకరాలకు సాగునీరు నిర్విరామంగా అందుతున్నది. ఇదే ఆయకట్టు కింద దాదాపు 1200 ఎకరాల పండ్ల తోటలు, ఇతర పంటలకు సైతం సాగునీరు ఈ లిఫ్టు ద్వారానే అందుతున్నది.

● ఆయకట్టు కింద మంచి దిగుబడి



అమరచింత లిఫ్టు ఆయకట్టు కింద వరి పంట పండిస్తాం. మంచి దిగుబడి వస్తుంది. లిఫ్టు నుంచి వదిలే సాగునీటిని ఆయా గ్రామాల రైతులందరం సద్వినియోగం చేసుకుంటున్నాం. లిఫ్టు కమిటీ సభ్యులు రైతులందరిని సమన్వయం చేస్తారు. ఆయకట్టు కింద మంచి ఫలితాలు వస్తున్నాయి.

● లక్ష్మీకాంత్ రెడ్డి, రైతు, అమరచింత


లిఫ్టు ప్రధాన కాలువ నుంచి విడుదలవుతున్న సాగునీరు

సెక్షన్ అధికారిపై వేటుకు రంగం సిద్ధం?

» ఆయన అక్రమాలకు అంతేలేదు..
» షాక్‌కు గురవుతున్న జిల్లా అధికారులు

మహమ్మదాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ సెక్షన్ అధికారి అక్రమాలకు అధికారులు షాక్‌కు గురవుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో చెట్లు నరికి కలప రవాణా ఎలా చేశాడని అవాక్కు అవుతున్నారు. అధికారులు చేపట్టిన విచారణతో అసలైన నిజాలు వెలుగు చూస్తున్నాయి. ఏపుగా పెరిగిన నీలగిరి చెట్లను నరకడమే కాకుండా, కలపను దాచి పెట్టి అనువైన సమయంలో అమ్ముకున్నాడు. ఇంత జరిగినా కనీసం పక్కవారికి తెలియకుండా జాగ్రత్తపడ్డాడు ఆ సెక్షన్ అధికారి. కట్టెలు నరికిన కూలీలకు ఇప్పటికీ కూలీ (డబ్బులు) ఇవ్వలేదని అక్కడ పని చేసిన వారు చెపుతున్నారు. జూలపల్లి, కొండాపూర్ అటవీ ప్రాతంలో జరిగిన అక్రమ కలప రవాణాకు రూ.లక్షల విలువ చేస్తుందని అధికారుల విచారణలో తేలింది. నీలగిరి చెట్ల మొదళ్లను గుర్తుపట్టకుండా వాటిపై చెత్తాచెదారం వేసి పెట్రోల్ పోసి తగుల పెట్టడం తెలిసిందే. దీనిపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను అటవీ శాఖ ఉన్నతాధికారులకు సోమవారం సమర్పించనున్నట్లు ఇప్పటకే చెప్పారు. అయితే ఈ విచారణ ఫైల్ అందిన వెంటనే సదరు సెక్షన్ అధికారిపై చర్యలు తీసుకొని, అక్రమాలకు పాల్పడినట్లు పూర్తి స్థాయిలో రుజువైతే సర్వీస్‌నుంచి కూడా తొలగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. మరికొందరు మాత్రం మరోసారి విజిలెన్స్ అధికారులు అటవీ ప్రాంతాన్ని పరిశీలించి విచారణ చేపడుతారని తెలిసింది.

● చర్యలు వద్దంటూ సెక్షన్ అధికారి పైరవీలు..

జూలపల్లి అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున లక్షల విలువ చేసే నీలగిరి, ఇతర కలప అమ్ముకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సెక్షన్ అధికారి మాత్రం చర్యలు తీసుకోకుండా అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ ప్రజాపతినిధి అండదండలు ఆయనకు బలంగా ఉన్నాయని, ఆయన అండతోనే ఈ అక్రమ రవాణా చేసినట్లు మండల వ్యాప్తంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. నిత్యం ఆ ప్రజాప్రతినిధి వద్దకు తిరుగుతున్నట్లు సమాచారం. అయితే ఈ విషయంలో అధికారులు అంటిముట్టనట్లు ఉంటున్నారు. ఎవరో చేసిన తప్పుడు పనికి మనం బలికావడం ఏంటని అక్కడ జరిగిన అక్రమాల నివేదికను ఉన్నది ఉన్నట్లు సిద్ధం చేసినట్లు తెలుస్తున్నది. ఈ అటవీ ప్రాంతంలో ఆమనగల్లు రేంజ్ అధికారులు కూడా పర్యటించి కలప రవాణా చేసిన లారీలో ఉన్న కట్టె, ఇక్కడ ఉన్న కట్టె ఒకటేనా అన్న స్థాయిలో విచారణ చేసినట్లు సమాచారం. అంతేకాకుండా లారీ తరలిస్తున్న డ్రైవర్, క్లీనర్‌లను కూడా పూర్తి స్థాయిలో విచారించినట్లు తెలిసింది.


చెట్ల మొదళ్ల వద్ద పెట్రోల్ పోసి తగుల బెడుతున్న కూలీలు

అటవీ అధికారిపై చర్యలు తీసుకోరా?

» జూలపల్లి అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన సీపీఎం రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ బృందం


జూలపల్లి అడవిలో చెట్లు నరికి మొదళ్లను కాల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మహమ్మదాబాద్ మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు చిన్నపాటి చెట్లను నరికి పొలం సాగు చేసుకున్నారని పలువురు రైతులను జైలుకు పంపించిన అటవీ అధికారులు.. ఆ శాఖలో పనిచేస్తున అధికారి 40 లక్షల విలువచేసే కలపను అమ్ముకుంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్, జిల్లా కార్యదర్శి ఎ.రాములు అన్నారు. జూలపల్లి అటవీ ప్రాంతంలోని నీలగిరి చెట్లు నరికి ఆనవాళ్లు లేకుండా చేసి పెట్రోల్ పోసి తగుల పెట్టిన ప్రాంతాన్ని వారు సీపీఎం బృందం సభ్యులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకోసం ప్రభుత్వాలు వేల కోట్లు ఖర్చుచేసి మొక్కలు నాటుతుంటే వాటిని కాపాడాల్సిన అటవీ శాఖాధికారులు ఏపుగా పెరిగిన చెట్లను నరికి అమ్ముకుంటే ఉన్నతాధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. సొంత లాభం కోసం అడవిని ఆనవాళ్లు లేకుండా చేసిన ఘనుడిపై చర్యలు తీసుకునేందుకు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇదే అడవిలో ఓ కాపరి తన మేకలకు చెట్ల కొమ్మలు మేపాడని అతని వద్ద ఓ మేకపిల్లని తీసుకున్న సెక్షన్ అధికారి లక్షల రూపాయల విలువ చేసే కలపను అక్రమంగా అమ్ముకుంటే వారం రోజులైనా పైఅధికారులు స్పందించడం లేదన్నారు. ఇందులో ఉన్నతాధికారుల పాత్ర కూడా ఏమైనా ఉందా అన్న అనుమానాలు కలుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ స్పం దించి జూలపల్లి అడవి నుంచి అక్రమ కలప రవాణా చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు నర్సింహులు, వై.లక్ష్మ య్య, బి.రాజు, జంబుల బాల్‌రెడ్డి, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శంకరలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

» భారీగా తరలిరానున్న ఇరు రాష్ట్రాల భక్తులు

ఊట్కూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కొలిచిన వారికి కొంగు బంగారంగా నిలిచి నిత్యంపూజలు అందుకుంటున్న ఇడ్లూర్ శంకర లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని సమీస్తాపూర్ గ్రామ సమీపంలో కర్ణాటక యాద్గిర్ జిల్లా పరిధిలో ఇడ్లూర్ గ్రామంలో వెలసిన స్వామివారి బ్రహ్మోత్సవాలు పదిహేను రోజుల పాటు ఘనంగా కొనసాగనున్నాయి. మార్చి 17, సోమవారం ఉదయం తెల్లవారు జామున అగ్నిగుండం, మార్చి 18న సాయంత్రం ప్రభోత్సవం, 19న బుధవారం ఉదయం స్వామివారి గంగ స్నానం, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, మహామంగళహార తి అనంతరం సాయంత్రం స్వామి వారి మహార థోత్సవం కొనసాగుతుంది. ఇక్కడున్న రావి, వేపచెట్టు చుట్టూ ప్రదక్షిణ లు చేస్తే దీర్ఘకాలిక వ్యాధులు తగ్గడంతో పాటు సంతానం లేనివారికి సంతానం కల్గుతుందని భక్తుల విశ్వాసం. రెండు వాగుల సంగమంలో వెలసిన ఈ క్షేత్రంలోని నంది విగ్రహం నాసిక రంధ్రం ద్వారా ఎల్లప్పుడు నీటిధార వస్తూ ఉంటుంది. ఉత్సవాలకు తెలంగాణ కర్ణాటక లోని వేలాది భక్తులు తరలివచ్చి తమ మొక్కుబడులు తీర్చుకుంటారు.

చరిత్రలోకి వెళితే....

క్రీ.శ.1015లో ప్రస్తుత కర్ణాటక రాష్ట్రంలోని ప్రస్తుతం యాదగిరిని (అప్పటి వేదగిరిని)రాజధానిగా చేసుకొని జయసింహరాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయన కాలంలోనే ఇడ్లూర్ శంకర లింగేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించినట్లు ఆయా శాసనాల్లో ఉన్నట్లు పూర్వీకులు చెబుతున్నారు. ఆయన ఆంధ్ర ప్రాంతంలోనున్న పట్నం చెరువు వరకు పరిపాలించాడు. శివభక్తుడు కావడంతో ఆయన పరిపాలనలో అనేక శివాలయాలను నిర్మించినట్లు ప్రతీతి. ఈ దేవాలయం నిర్మాణంలో శిల్పకళలను కర్ణాటకలోని ఎలబర్గి తాలూకా ఇటుక మహా దేవాలయం, లాకూడిలో కాశీ విశ్వే శ్వర దేవాలయం, గదక్‌లో త్రికూటేశ్వర దేవాలయం, కుల్వర్గులోని మల్లికార్జున దేవాలయాలశిల్పకళను పోలిఉన్నాయని పూర్వీకులు చెబుతున్నారు.


శంకరలింగేశ్వర స్వామి దేవాలయం, స్వామివారి మూలవిరాట్

పొలంలో ఉద్భవించిన స్వామి...

శంకరలింగేశ్వర స్వామి ఆలయం గతంలో ఇడ్లూ ర్‌కు చెందిన కుమ్మరి గుండయ్య దంపతులు తమ పొలంలో ఉద్భవించారు. ఆ దంపతులు పొలంలో పాముపుట్టను నాగ లితో ఎన్ని సార్లు దున్నినా యథావిధిగా పెరిగేది. ఈ క్రమంలో పు ట్టను పెకిలించేందుకు పెద్దనాగలితో దున్నగా స్వామివారి విగ్రహం బయట పడింది. ఆ దంపతులు అక్కడికక్కడే శిలలుగా మారారు. విషయం తెలుసుకున్న జయసింహరాజు ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శిలలుగా మారిన దంపతుల విగ్రహాలు ఇప్పటికీ ఆలయ ప్రాంగణంలో కన్పిస్తాయి. ఇప్పటికీ శివాలయంతో పాటు ఆ విగ్రహాలను భక్తులు దర్శించుకుంటారు. అన్ని ప్రాంతాల్లో లింగాకారంలో ఉంటే.. ఇక్కడ మాత్రం విగ్రహ రూపంలో ఉండటం ప్రత్యేకం.

ఎద్దుల సంత ప్రత్యేకం

ఈ ఉత్సవాల్లో భాగంగా ఇక్కడ జరిగే ఎద్దుల సంతలో క్రయ విక్రయాలు జోరుగా కొనసాగుతాయి. ఒక్కో జతకు రూ.60వేలు మొదలుకొని రూ.2 లక్షల వరకు ఖరీదు పలుకుతాయి. నెల్లూర్, శ్రీరంగపట్నం, గద్వాల ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన ఎద్దులను ఈ జాతరలో విక్రయిస్తారు.

ఇంటర్వ్యూ..

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

- డీఎల్‌పీవో వరలక్ష్మి



కందనూలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ డీఎల్‌పీవో వరలక్ష్మి తెలిపారు. డివిజన్ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి పైపులైన్‌లో లీకేజీలను గుర్తించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నామని, మిషన్ భగీరథ నీటితో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న నదుపాయాలు, బోరుబావుల ద్వారా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసు కుంటున్నట్లు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంట ర్వ్యూలో తెలిపారు.

పారిశుధ్య పనులు ఎలా జరుగుతున్నాయి ?

పారిశుధ్య పనులు ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శుల ద్వారా పర్యవేక్షిస్తూ చేపడుతున్నాం. డ్రైనేజీల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు లీకేజీలు వంటి పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నాం.

వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉందా?

వీధి దీపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులేకుండా మరమ్మతులు చేపడుతున్నాం. పాడైన దీపాలను తొలగించి కొత్త దీపాలను అమర్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఇంటి పన్ను వసూలు చేస్తున్నారా?

ఇంటి పన్ను వసూలు చేస్తున్నాం. ప్రజలు కూడా అధికారులకు సహకరించి బకాయిలు చెల్లించాలి. పన్నులు చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యం.

న్యూస్ బాక్స్

ప్రశాంతంగా 'ఏకలవ్య ప్రవేశ' పరీక్ష

వెల్దండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుండాల ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు 394 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 344 మంది విద్యార్థులు హాజరయ్యారు. బాలురు 204 మంది, బాలికలు 140 మంది ప్రవేశ పరీక్ష రాశారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రిన్సిపాల్ పార్థివ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వాహకులు పరీక్ష నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే గువ్వల పరామర్శ

వంగూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ ఆదివారం మృతి చెందారు. అదే విధంగా మాజీ జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు అమీద్ తండ్రి గఫార్ అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకొన్న అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదేవి ధంగా బాధిత కుటుంబాలను మాజీ సర్పంచ్ గణేశ్‌రావు, నాయకులు పరామర్శించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన జంగిలి ఈదమయ్య కుటుంబాన్ని ఆదివారం పీఏసీఎస్ చైర్మెన్ జూపల్లి భాస్కర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకులకు వ్యక్తిగతంగా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిదంగా వెల్దండకు చెందిన లక్ష్మమ్మ మృతిచెందగా పీఏసీఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ రూ.5వేలు, బీజేపీ నాయకులు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ రాజేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, నాయకులు నిరంజన్, మధుసూదన్‌రెడ్డి, ఆనందు, సాయికుమార్, జంగిలి యాదగిరి, ప్రసాద్, రామస్వామి, పుల్లయ్య, నారాయణ, కిష్టాలు తదితరులు ఉన్నారు.

'చలో ఢిల్లీకి' అధిక సంఖ్యలో తరలి రావాలి : ఏఐటీయూసీ

కందనూలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీబీసీడబ్ల్యూ పిలుపు మేరకు మార్చి 28న పార్లమెంట్ ముందు నిర్వహించే చలో ఢిల్లీకి పెద్ద ఎత్తున తరలి రావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ కోరారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్‌లో చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్మికులు అధిక సంఖ్యలో ఢిల్లీకి తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్నపాగ శ్రీనివాసులు, సిద్దేసి విజయ్, ఈర్ల భూపేష్, శ్రీనివాస్‌రెడ్డి, సిద్దేసి సురేష్, డి.రాములు, రామస్వామి, వెంకటయ్య, రాజు పాల్గొన్నారు.

'న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి'

పెంట్లవెల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు కురుమయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీశైలం ప్రాజెక్టు కోసం 43 సంవత్సరాల క్రితం ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇప్పటికీ కూడా సరైన పరిహారం అందలేదని పేర్కొన్నారు. గతంలో ఎన్నో ఉద్యమాలు చేపట్టినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మరిచిపోతున్నాయని దుయ్యబట్టారు.

కాలనీలో కంపు.. కంపు




మండల కేంద్రంలో అస్తవ్యస్తంగా మారిన సీసీ రోడ్లు

- అస్తవ్యస్తంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ

- ఇబ్బందుల పాలవుతున్న ప్రజలు

తెలకపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తెలకపల్లి, మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లు పగిలిపోయి మొక్కలు, గడ్డి మొలుస్తున్నాయని, ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ డ్రైనేజీ వల్ల విపరీతమైన దుర్గంధం వెదజల్లుతున్నది. దాంతో ఇంటి ముందు కూర్చోవడానికి కూడా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. చేపలు అమ్మేవారు చేపల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను మ్యాన్ హోల్స్‌లలో పడేయడం వలన విపరీతమైన దుర్గంధం వస్తున్నది. చెత్త ఎక్కడ పడితే అక్కడే పడేస్తున్నారు. బస్టాండ్ దగ్గర ఉన్న గల్లీలో ఇంత వరకు సీసీ రోడ్డు లేకపోవడం వల్ల రోడ్డు గుంతలమయంగా మారి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే ప్రాంతాల్లో డ్రైనేజీల్లో మురికి నీరు మల్లుకుని మడుగులా మారి దుర్గంధం వెదజల్లుతు న్నది. ఈ విషయంపై అనేకసార్లు స్థానిక ఈవోకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అచ్చంపేట రోడ్డులో రెండు ప్రైవేట్ స్కూళ్ల మధ్య ఉన్న డ్రైనేజీ అడుగు భాగాన సీసీ వేయడంతో నీళ్లు ఇంకిపో కుండా నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. ఇదేమిటని ప్రశ్నించే వాళ్లు లేకపోవడం వల్ల గ్రామ పంచాయతీ వ్యవస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నదని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని డ్రైనేజీ సీసీ రోడ్లు వ్యవస్థను బాగు చేయాలని కోరుతున్నారు.

ఇవేమి డ్రైనేజీలు



డ్రైనేజీ వ్యవస్థ ఏమీ బాగాలేదు. ఇదేమి డ్రైనేజీ మాత్రం పట్టించుకోవడం లేదు. కూలిపోతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సీసీ రోడ్లు పగిలిపోయి గడ్డి మొలుస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీ సీసీ రోడ్లను బాగు చేయాలి.

- కే ప్రశాంత్, స్థానికుడు

మరమ్మతులు చేస్తాం



డ్రైనేజీలు పగిలిపోయిన దగ్గర మరమ్మతులు చేయిస్తాం. మురికినీరు నిలువలే కుండా చేయిస్తాం. సీసీ రోడ్ల మరమ్మతులు కూడా త్వరగా చేయడానికి ప్రయ త్నిస్తాం.

- ఈవో భాస్కర్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. అంతకు ముందు గ్రామస్థులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. నియోజకవర్గంలోని పంచాయతీరాజ్ రోడ్లను హ్యామ్ పైలెట్ ప్రాజెక్టులో అభివృద్ధిపరుస్తామన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు కశిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

చారకొండ : పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన జమ్ముల వెంకటేష్ మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది సీఎంఆర్ఎఫ్ కోసందరఖాస్తు చేసుకున్నాడు. మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం హైదరా బాద్‌లోని ఎమ్మెల్యే తన నివాసంలో బాధితుడు వెంకటేష్‌కు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలను ప్రవేశపెట్టి అండగా నిలుస్తుందన్నారు. అర్హులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాధగోని సాంబయ్యగౌడ్, నాయకులు శంకర్ నరేందర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ



రిలే దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కల్వకుర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గోవిందు నరేష్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తే మాదిగలకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. ఎస్సీల్లో అత్యధిక జనాభా గల మాదిగలకు 70 ఏళ్లుగా నియామకాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోంద న్నారు. నేడు సోమవారం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చట్టం అసెంబ్లీలో పెడతామని ప్రభుత్వం ప్రకటించిందని, దానితోపాటు ఉద్యోగ నియామకాలు కూడా వర్తించేలా చూడాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వీరస్వామి మా దిగ, పరుశరామ్‌మాదిగ, ఎంఈఎఫ్ డివిజన్ అధ్యక్షుడు ఇంజమూరి భాస్కర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు జంగయ్య, మబ్బు రామరాజు, లాలయ్య, ముప్పిడి కృష్ణ, శేఖర్, పరశురాముడు, అంజి, నరేష్, నాని, దేవరాజ్, కిరణ్, జగన్, విజయ్, జంగయ్య, సురేష్, రాజు, మల్లేష్ ఉన్నారు.

వర్గీకరణతోనే మాదిగల భవిష్యత్తు

ఊర్కొండ : ఎస్సీ వర్గీకరణ చేయడంతోనే మాదిగల భవిష్యత్తు ఉందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాజుమాదిగ అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన దీక్షలు ఆరవ రోజుకు చేరాయి. ప్రస్తుతం కొనసాగుతున్న శాసనసభలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో పరశురామ్, వెంకట్, చిన్న, శ్రీశైలం, కృష్ణ ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు

చారకొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని జూపల్లిలో ఆదివారం వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బాలెమియా, సాయికుమార్, మాజీ ఉపసర్పంచ్ కలమందల జగపతి, ముస్లిం సోదరులు సిరాజ్, ఖదీర్, అబ్దుల్లా, కమాల్, అజీమ్, రియాజ్, చాందు, ఖాదర్ పాల్గొన్నారు.

రెగ్యులర్ డాక్టర్‌గా నారాయణస్వామి

పెద్దకొత్తపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడిగా డాక్టర్ నారాయణస్వామి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారి రోహిత్ పీజీ సీటు రావడంతో వెళ్లారు. దీంతో బిజినేపల్లి మండలం లట్టుపల్లి పీహెచ్‌సీలో పని చేస్తున్న నారాయణ స్వామిని ఇక్కడికి బదిలీ చేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్



రాపర్తి శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానించిన అసోసియేషన్ సభ్యులు

అచ్చంపేటటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఫొటో, వీడియో గ్రాఫర్స్ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన, కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను కలిసి ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం అచ్చంపేట ఫొటో, వీడియో గ్రాఫర్స్ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గిరి, రాష్ట్ర సహాయ కార్యదర్శి భీమాచారి, చంద్రమౌళి, గురుస్వామి, పల్లి బాలరాజు, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేయాలి

- డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్



ఇళ్లను పరిశీలిస్తున్న డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రతినిధి బృందం

కందనూలు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లాఅధ్యక్షుడు కొమ్ము భరత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో బస్సు డిపో దగ్గర గత ప్రభుత్వంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోగా, ఆ ఇళ్లను డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకులు పరిశీలించారు. భరత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఆరు గ్యారెంటీల అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. 192 డబుల్ బెడ్రూంలు నిర్మించి అసంపూర్తిగా నిర్మాణాన్ని గత ప్రభుత్వం గాలికొదిలేసిందని అన్నారు. అలాగే పెద్దముద్దునూర్, వనపట్ల గ్రామాల్లో డబుల్ బెడ్రూంలు నిర్మించి అసంపూర్తిగా నిర్మాణం పూర్తి చేయకుండా వదిలేశారని అన్నారు. ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేసి అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శివశంకర్, కొత్త రామస్వామి, చిన్నపాగ శ్రీనివాస్, నాయకులు కొమ్ము భీమయ్య, నరసింహ, లక్ష్మమ్మ, యశోద పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోవాలి

-పౌష్టికాహారం పంపిణీలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి



క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

తాడూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పోషకాహారంతో క్షయ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోవాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. తాడూరు మండల కేంద్ర ఆవరణలో క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పోషకాహార కిట్లను పంపిణీ చేసే కార్యక్రమానికి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతీ రోజు చికిత్సతో పాటుగా ఈ అదనపు పోషకాహారం కిట్లను వినియోగించుకుని క్షయ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్‌వో కేవీ.స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ డిసెంబరు 7వ తేదీ నుంచి నిర్వహించిన వంద రోజుల నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో ఇప్పటి వరకు జిల్లాలో 238 క్యాంపులను ఏర్పాటు చేసి 1,32,588 మందికి టీబీ వ్యాధి కోసం పరీక్షలు చేసినట్లు తెలిపారు. ప్రతీ నెల ఒక పోషకాహార కిట్టును అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీడీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాస్, నాట్కో ఫార్మా కంపెనీ ప్రతినిధి మదన్మోహన్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాజశేఖర్, వైద్యాధికారి సంతోష్‌అభిరామ్, డీపీవో రేణయ్య, పర్యవేక్షణ సిబ్బంది, ఏఎన్ఎమ్‌లు, ఆశాలు, వ్యాధి గ్రస్తులు పాల్గొన్నారు.

మామిళ్లపల్లిలో బండలాగుడు పోటీలు

ఉప్పునుంతల : మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల భాగంగా ఆదివారం ఆలయం ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యేను అర్చకులు స్వాగతం పలికి ఆలయంలో ప్ర త్యేక పూజలు చేయించారు. ఎమ్మెల్యేకు ఆలయ చైర్మన్ నరసింహారావు శాలువా కప్పి సన్మానించారు. విజేతలుగా నిలిచిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహారావు, మాజీ జడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణానరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ ఇంద్రాసేనారెడ్డి, కాగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, నాయకులు రఘుపతిరెడ్డి, గంగుల నరసింహారెడ్డి, మోహన్‌గౌడ్, ఆలయ పాలక మండల సభ్యులు గణేష్‌గౌడ్, ఆలయ ఈవో నరసింహులు ఉన్నారు.

మానవాళికి టీకాలే సంపూర్ణ రక్ష

- జిల్లా టీకీకరణ అధికారి రవి కుమార్ నాయక్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా టీకీకరణ అధికారి డాక్టర్ రవి కుమార్ నాయక్

తెలకపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మానవాళికి టీకాల సంపూర్ణ ప్రాణ రక్షణ అని, ప్రతీ గర్భవతి, శిశువు సంపూర్ణ టీకీకరణే మన లక్ష్యమని జిల్లా టీకీకరణ అధికారి డాక్టర్ రవి కుమార్ నాయక్ అన్నారు. జాతీయ టీకీకరణ దినోత్సవం సందర్భంగా ఆయన ఆదివారం తెలకపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వ్యాక్సిన్ నిల్వలను, రికార్డులను, శీతలీకరణ, మెయింటనెన్స్‌ను ప్రత్యేకంగా పరిశీలించారు.ప్రతీ చిన్నారికి 12 ప్రాణాంతక వ్యాధులు రాకుండా టీకీకరణ చేస్తున్నామని తెలిపారు. శీతలీకరణ స్థితిని ఈ-విన్ ద్వారా ఆన్‌లైన్‌లో పర్యవేక్షణ చేయవచ్చని తెలియజేశారు. జిల్లాలో ప్రతి బుధ, శనివారం గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని మహిళా ఆరోగ్య కార్యకర్తలు నిర్వహిస్తున్నారని తెలిపారు. త్వరలో ఆరు రకాల కేటగిరి చెందిన పెద్దవారికి కూడా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం, ఆడవారికి గర్భాశయం ముఖ ద్వారా క్యాన్సర్ రాకుండా నివారించడానికి హెచ్‌పీవీ 12-17 సంవత్సరాల ఆడ పిల్లలకు టీకీకరణ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతపట్ల నీరజ్‌కుమార్, పర్యవేక్షకుడు ఫసియొద్దీన్, మగ ఆరోగ్య కార్యకర్త టి.యాదగిరి, రవీందర్‌రావు, అనురాధ పాల్గొన్నారు.

విశారదన్ యాత్రను విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

కల్వకుర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ చేపట్టబోయే లక్ష కిలో మీటర్ల మా భూమి రథ యాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సాయి మహరాజ్ కోరారు. కల్వకుర్తిలోయాత్ర కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఏప్రిల్ 14న ఆదిలాబాద్ నుంచి మా భూమి రథయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడిత ప్రజానీకానికి కావాల్సింది రాజ్యాధికారమని, ఆ రాజ్యాధికారం ప్రజలకు దక్కడానికి విశారదన్ మహారాజ్ లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్ర చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ మహరాజ్, వివిధ మండలాల అధ్యక్షులు రాజు, చంద్రశేఖర్, సైదులు, రవి, శ్రీకాంత్, నాయకులు మురళి, విజయ్, మల్లేష్, రమేష్, అంజి ఉన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ విడుదల



బొమ్మరాజుపల్లి లక్ష్మీచెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో వెలిసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను గుడిగానిపల్లి గ్రామంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆదివారం విడుదల చేశారు. ఈ నెల 29న ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో చెన్నకేశవ స్వామికి గ్రామస్థులు అభిషేకం, లక్ష్మీఅష్టోత్తరం, విష్ణు సహస్ర నామపారాయణం వంటి పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం కొండపైకి స్వామివారు చేరుకుంటారని నిర్వాహకులు తెలిపారు. మరుసటిరోజు కల్యాణోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

● గుడిగానిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు జంగయ్య ఇటీవల మృతి చెందగా, ఆదివారం దశదిన కర్మ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి, జంగయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆదినారాయణ, నాయకులు జంగయ్య మాదిగ, వాటం రఘు, లోహిత్‌రెడ్డి, అయూబ్‌పాషా, ఆరిఫ్, మనోహర్ రెడ్డి ఉన్నారు.

స్పీకర్‌ను అవమానించడంపై కాంగ్రెస్ నిరసన



అచ్చంపేట : అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేటటౌన్/ కల్వకుర్తి/ వెల్దండ/ బల్మూరు/ పదర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అగౌరవ పరిచారని జిల్లాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసనలు చేపట్టారు.

అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపి, మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల చిత్రపటాలను దహనం చేశారు. గ్రంథాలయ చైర్మన్ జిల్లా రాజేందర్ మాట్లాడుతూ దళితులంటే బీఆర్ఎస్ నాయకులకు చిన్నచూపేనన్నారు. వెంటనే స్పీకర్‌తో పాటు దళితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, పాలశీ తలీకరణ చైర్మన్ నర్సయ్యయాదవ్, నాయకులు కటకం రఘు, మాజీ ఎంపీపీ రామనాథం పాల్గొన్నారు.

● కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ధర్నాకు దిగారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అసెంబ్లీలో ప్రతీ ఒక్కరు సభా మర్యాదలు పాటించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పరశపాకుల శేఖర్, రాములు, దామోదర్‌గౌడ్, జగన్, శ్రీనివాసులు, పాండు, సైదులు, పర్వతాలు, శ్రీను, చంద్రకాంత్ రెడ్డి, రమాకాంత్‌రెడ్డి ఉన్నారు.

● వెల్దండ : అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి చేసిన అనుచిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను ప్రధాన రహదారిపై దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, మోతీలాల్, వెంకటయ్యగౌడ్, పర్వత్‌రెడ్డి, కాడురాం, పుల్లయ్య, శ్రీనుయాదవ్, భరత్, ఎర్రశ్రీను, మల్లేష్ ఉన్నారు.

● బల్మూరు : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ మంత్రలుఓ కేటీఆర్, జగదీశ్వర్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంప్రసాద్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు మాజీ సర్పంచ్ సుధాకర్‌గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు ఖదీర్, ఉపాధ్యక్షుడు మాశన్న, తాజా మాజీ సర్పంచ్ ఎల్లికంటి శ్రీనివాసులు, ఓబీసీ సెల్ అధ్యక్షుడు శివగౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

● పదర : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏఆర్.యాదవ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొ మ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్యయాదవ్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్, ప్రేమ్, గోలి వెంకటయ్య, వెంకట్, ఖాజా, సైదాజీపాల్గొన్నారు.